# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- చుట్టపు చూపుగా వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి
- ఓడిపోగానే మళ్లీ అమెరికా వెళ్తుంది
- బీఆర్ఎస్ పాలకుర్తి అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి



పాలకుర్తిలో మంత్రి ఎర్రబెల్లి ప్రసంగాన్ని వింటున్న ప్రజలు



మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి రూరల్, నవంబర్ 28: పాలకుర్తి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి తనను మరోసారి ఆశీర్వదించాలని పాలకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రజలకు పిలుపునిచ్చారు. వచ్చిరాని హామీలతో ప్రజలను ఆగం పట్టించాలని చూస్తూ ఈ ప్రాంతంపై కనీస అవగాహన లేని కాంగ్రెస్ అభ్యర్థిని చిత్తుగా ఓడించాలని ఆయన కోరారు. మంగళవారం పాలకుర్తి మండల కేంద్రంలో రోడ్ షో నిర్వహించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్లు కోలాటాలు బోనాలతో ప్రజలు మంత్రి ఎర్రబెల్లికి ఘనస్వాగతం పలికారు. పట్టణ వాసులను కలిసి బీఅర్ఎస్‌కు ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, తండాల్లో సీసీ రోడ్లు వేశానన్నారు. ఇంటింటికీ మిషన్ భగీరథ పథకం ద్వారా తాగు నీరు అందించానన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు కొత్త గ్రామ పంచాయతీ ఏర్పాటు చేశానన్నారు. తాను చేసిన అభివృద్ధిని చూసి మళ్లీ తనకే ఓటు వేసి గెలిపించడంతో పాటు సీఎం కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఆయన అభ్యర్థించారు. మహిళలకు కుట్టు శిక్షను ఇప్పించడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు.నిరుద్యోగ యువత కు ఉపాధి ఉద్యోగ అవకాశాల కోసం శిక్షణ, ఉచిత జాబ్ మేళాలు, ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించినట్లు వివరించారు. కరోనా కష్టకాలంలో ప్రజల మధ్య ఉంటూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేశానని ఎర్రబెల్లి తెలిపారు. ఆనందయ్య మందు తెచ్చి కూడా ప్రజలకు ఉచితంగా అందజేశానన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా చెప్పుకునే వారికి ఈ ప్రాంతంపై కనీస అవగాహన ఉందా అని ప్రశ్నించారు. డబ్బులు వెదజల్లితే గెలుస్తామని గాంభీర్యాన్ని ప్రదర్శించే అలాంటి వారిని ఓడించి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. మరోసారి విజయం సాధించిన అనంతరం పాలకుర్తిని రెవెన్యూ డివిజన్ చేయడంతోపాటు కొత్తగా రెండు మండలాలను ఏర్పాటు చేస్తానన్నారు. నూతనంగా ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తానన్నారు. రైతులకు ఇబ్బంబదులకు గురి చేస్తున్న కోతులను పట్టిస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే, ఆరోగ్య శ్రీ ట్రస్టు చైర్మన్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్ సుధాకర్‌రావు మాట్లాడుతూ పాలకుర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి, ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, సర్పంచ్ వీరమనేని యాకాంతారావు, పట్టణ అధ్యక్షుడు కడుదుల కర్ణాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి కృష్ణ, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ మదార్, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎండీ సర్వర్‌ఖాన్, ఎండీ వహిద్, కాటబత్తిని రమేశ్, వీరమనేని సోమేశ్వర్‌రావు, సలేంద్ర సోమన్న, బెల్లి యుగేందర్, వీరమనేని హనుమంతరావు, మామిండ్ల లక్ష్మణ్, చిలుకమారి నాగేశ్వర్, కత్తుల యాకయ్య, వీరమనేని తిమ్మారావు, కారుపోతుల కుమార్, కమ్మగాని అశోక్, కత్తి దస్తగిరి, సలాం పాల్గొన్నారు.



దేవరుప్పలలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి

## తెలంగాణ దార్శనికుడు సీఎం కేసీఆర్

- రాష్ట్రంలో అనూహ్య అబివృద్ధి.. సంక్షేమంలో నంబర్‌వన్
- అమెరికా నుంచి వచ్చిన వారికి ఓటడిగే హక్కు లేదు..
- పాలకుర్తిలో విజయం నాదే.. ప్రజలు ఆశీర్వదించి భారీ మెజార్టీ ఇవ్వాలి
- బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, నవంబర్ 28: తెలంగాణ దార్శనికుడు సీఎం కేసీఆర్, తెలంగాణ సాధించడంతోపాటు రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపిన ఘనత ఆయనదేనని బీఆర్ఎస్ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా దేవరుప్పుల మండల కేంద్రంలో మంగళవారం ఉదయం రోడ్‌షో నిర్వహించారు. కొత్తవాడ నుంచి మొదలైన ర్యాలీ గ్రామంలో కిలోమీటర్ వరకు కొనసాగింది. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్ సుధాకర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి ర్యాలీ పాల్గొనగా కూడలిలో ప్రజనుద్దేశించి మంత్రి ఎర్రబెల్లి మాట్లాడారు. తెలంగాణ ఆవిర్భావం వేళ ఉద్యమ పార్టీగా ప్రజలు ఆదరించగా, రెండో దఫాలో సంక్షేమ ఫలాలను మెచ్చి బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు పట్టకట్టారని తెలిపారు. మూడోసారి రాష్ట్రంలో అన్ని రంగాల్లో జరిగిన అభివృద్ధిని చూసిన ప్రజలు మరోమారు కేసీఆర్ సర్కారును ఆశీర్వదించనున్నారన్నారు. అభివృద్ధిలో వెనకబడిన నియోజకవర్గమైన పాలకుర్తిని సాగు, తాగు నీరు, రవాణా, ఆరోగ్యం, విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి చేశానని ఆయన తెలిపారు. సంక్షేమ పథకాలను ఇంటింటికీ అందించడం నాకు గర్వంగా ఉందన్నారు. గ్రామాల్లో రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేసినట్లు వివరించారు.

**పాలకుర్తిలో ఓట్లడిగే హక్కు నాకే ఉంది..**

పాలకుర్తి నియోజకవర్గ చరిత్రలో రికార్డు స్థాయి అభివృద్ధి ఈ ఐదేళ్లలో జరిగిందని, ఇదే నాకు నాలుగోసారి గెలుపునకు బాటవేస్తుందని మంత్రి ఎర్రబెల్లి అన్నారు. నా ఒక్కడికే ఓటడిగే హక్కు ఉందని, అడ్రస్ లేని వారు అమెరికా నుంచి వచ్చి ఓటెయ్యాలని అడిగితే ప్రజలు పట్టించుకోరని తెలిపారు. అమెరికా నుంచి తెచ్చిన అక్రమ సంపాదనతో రేవంత్‌రెడ్డికి డబ్బులిచ్చి టికెట్ కొనుక్కుంటే ఓట్లు పడతాయనుకోవడం అవివేకమౌతుందన్నారు. సీఎం కేసీఆర్ తనకు మంత్రి పదవి ఇవ్వడంతో పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశానని ఆయన తెలిపారు. పిలిస్తే పలికే దయన్న కావాలా.. పిలిస్తే తాను అమెరికాలో ఉన్నానని చెప్పే ఆ విదేశీయులు కావాలా ..? ఓటర్లు తేల్చుకోవాలని కోరారు. ఆరోగ్య ట్రస్టు చైర్మన్, మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌రావు మాట్లాడుతూ ఎవరికి ఎలాంటి వైద్యం అవసరమైనా ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 15 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు ఆరోగ్యశ్రీ సేవలు అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఈదునూరి రమాదేవి, ఎంపీటీసీ తోటకూరి రేణుక, జడ్పీటీసీ పల్లా భార్గవీ రెడ్డి, ఎంపీపీ బస్వ సావిత్రి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ నర్సింహరెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా సభ్యుడు కారుపోతుల భిక్షపతి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు లొడంగి వెంకన్న, పెద్దాపురం వెంకటేశ్వర శర్మ, గోలి ఉప్పల్‌రెడ్డి, బూత్కూరు అశోక్‌రెడ్డి, తోటకూకి కిష్టయ్య, ఉప సర్పంచ్ దశరథ, జోగు సోమనర్సయ్య, అబ్బయ్య, చింత యాదగిరి పాల్గొన్నారు



దేవరుప్పలలో బీఆర్ఎస్ శ్రేణుల భారీ ర్యాలీ

## ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వ్యక్తిపై కేసు నమోదు

రఘునాథపల్లి నవంబర్ 28 : ఎన్నికల కోడ్ ఉల్లంఘించి మద్యం విక్రయించిన వ్యక్తి పై కేసు నమోదు చేయడంతో పాటు రూ. లక్ష జరిమానా విధించిన్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్ష్మీతండాకు చెందిన బానోత్ సుధాకర్ నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారంతో ఈ నెల 26న టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. సుధాకర్ వద్ద రూ.32 వేల విలువైన మద్యాన్ని సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ యుగేందర్ ముందు బైండోవర్ చేయగా మద్యం విక్రయించనని, దీనిని ఉల్లంఘిస్తే రూ.లక్ష జరిమానా విదించండని చెప్పి వెళ్లిపోయాడు. అనంతరం మళ్లీ యుగేందర్ మద్యం విక్రయిండంతో పోలీసులు గుర్తించి తహసీల్దార్ ముందు హాజరు పర్చగా రూ.లక్ష జరిమాన చెల్లించాలని ఆదేశాలు ఇచ్చారు. లేకుంటే జైలు శిక్షపడుతుందని తెలుపడంతో సుధాకర్ జరిమానా చెల్లించారు. ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు



ఆరుకాళ్ల గొర్రె పిల్లను చూపుతున్న గొర్రెలకాపరి కొమురయ్య

## శివాజీనగర్‌లో ఆరు కాళ్ల గొర్రె పిల్ల

రఘునాథపల్లి, నవంబర్ 28: ప్రతి జంతువుకు నాలుగు కాళ్లు ఉండడం సహజం. కానీ ఓ గొర్రె ఆరు కాళ్లతో కూడిన గొర్రెపిల్లకు జన్మనివ్వడం ఆసక్తిగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని శివాజీనగర్‌కు చెందిన గొర్రెల పెంపకందారు శివరాత్రి కొమురయ్య తన మందలోని ఓ గొర్రె మంగళవారం ఆరు కాళ్లతో కూడిన గొర్రెపిల్లకు జన్మనిచ్చింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు తండోప తండాలుగా వచ్చి వింత గొర్రె పిల్లను చూసి ఆశ్చర్యానికి గురయ్యారు. గొర్రెపిల్ల సజీవంగా ఉండడం విశేషం. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సహజంగా ఇలాంటి సంఘటనలు జరగడం వింతగా ఉందన్నారు.

# ఎన్నికల బందోబస్తుకు సర్వం సిద్ధం

- విధుల్లో 4 వేల పోలీసు సిబ్బంది, 1700 మంది కేంద్ర బలగాలు
- ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి
- సమస్యాత్మక ప్రాంతాల్లో భారీ భద్రత
- 4 తేదీ వరకు 144 సెక్షన్ అమలు
- వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝూ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ

సుబేదారి, నవంబర్ 28: ఈ నెల 30న జరిగే శాసన సభ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ పరంగా అన్ని ఏర్పాట్లు చేశామని, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అన్నారు. హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఎనిమిది అసెంబ్లీ స్థానాలతోపాటు పొరుగు జిల్లాల్లోని హుజురాబాద్, హుస్నాబాద్, భూపాలపల్లి అసెంబ్లీ స్థానాలకు జరిగే ఎన్నికలకు అన్ని చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో పూర్తి స్థాయిలో ఉన్న వర్ధన్నపేట, పరకాల, జనగామ, పాలకుర్తి, నర్సంపేట, స్టేషన్‌ఘన్‌పూర్ అసెంబ్లీ స్థానాల్లోని మొత్తం 1,128 ప్రాంతాల్లో 2126 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామని అంబర్‌కిశోర్‌ఝూ పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో డీసీపీ స్థాయి అధికారి నుంచి హోంగార్డు వరకు మొత్తం నాలుగు వేల పోలీసు సిబ్బంది, 1700 మందికిపైగా కేంద్ర పారా మిలటరీ బలగాలు ఎన్నికల విధులు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియామవళిని పటిష్టంగా అమలు చేయడానికి పెట్రోలింగ్ పార్టీలు, క్విక్ రియాక్షన్ విభాగాలు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు తనిఖీల ద్వారా రూ.12 కోట్ల 33 లక్షల నగదు ,55 లక్షల విలువైన మద్యం, పది లక్షల విలువైన గుడుంబా ముడిసరుకు నల్ల బెల్లం, రూ.కోటి 64 లక్షల విలువైన గంజాయి, ఆరున్నర కిలోల బంగారం, కిలోన్నర వెండి, ఓటర్లకు అందజేయడానికి రూ.13 లక్షల విలువైన బహుమతులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. 842 మందిపై కేసులు నమోదు చేశామని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా 7842 మందిని ముందస్తు అరెస్ట్ చేశామని, వీరిలో 579 మంది రౌడీషీటర్లు ఉన్నారని సీపీ అంబర్ వెల్లడించారు.

**ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే కఠిన చర్యలు**

ఎవరైనా ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. ఎక్కడ కూడా ఒకే చోట ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమి కూడకూడదన్నారు. ఇతర ప్రాంతాల నుంచి ప్రచారం కోసం వచ్చి లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, హోటల్స్‌లో బస చేసిన రాజకీయ పార్టీలకు చెందిన వారు ఖాళీ చేసి స్వస్థలాకు వెళ్లాలని సూచించారు. ఇతర కారణాలతో లాడ్జీల్లో ఉన్న వారు సరైన ఆధారాలు చూపాలని సీపీ సూచించారు. విలేకరుల సమావేశంలో డీసీపీలు అబ్దుల్ భారీ, రవీందర్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.